క్లుప్తంగా

బాల్య వివాహాలతో అనర్థాలు



నూజివీడు: బాల్య వివాహాల వల్ల భవిష్యత్‌లో అనేక అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తుందని, బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని సీనియర్ సివిల్ జడ్జి షేక్ పెద్ద ఖాసిం అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ ఆడ పిల్లలకు 18, మగ పిల్లలకు 21 ఏళ్ల వయస్సు నిండిన తరువాత మాత్రమే వివాహం చేయాలన్నారు. మైనర్లపై అఘాయిత్యాలకు పాల్పడితే పోక్సో కింద శిక్ష పడుతుందని హెచ్చరించారు. న్యాయవాదులు ఇందుపల్లి సత్యప్రకాష్, ఎస్‌కేడీ ప్రసాదరావు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఖిల్లా ముఖద్వారం పనుల పరిశీలన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బొమ్మల పరిశ్రమను అంతర్జాతీయంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన చర్యల్లో భాగంగా కొండపల్లి ఖిల్లా రోడ్డులో జరుగుతున్న ముఖద్వారం పనులను మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్ శనివారం పరిశీలించారు. చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బొమ్మల కళాకారులకు కావల్సిన మౌలిక వసతులు కల్పించడంతో పాటు బొమ్మల విక్రయాలు కొనుగోలు, బొమ్మల కాలనీ అభివృద్ధికి చర్యలు చేపట్టిందన్నారు. కౌన్సిలర్లు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్



నాగశైలజ, 15వ అదనపు జిల్లా జడ్జి

నూజివీడు: మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 13న నూజివీడులోని కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు 15వ అదనపు జిల్లా జడ్జి ఏ.నాగశైలజ శనివారం తెలిపారు. లోక్‌అదాలత్‌లో వీలున్న అన్ని క్రిమినల్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, ఎక్సైజ్ కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ కేసులు, సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో రాజీమార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. దీనిపై న్యాయవాదులు, పోలీసులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు.

కొనసాగుతున్న వైద్య శిబిరం

ముసునూరు: వేల్పుచర్లలో వైద్య శిబిరం కొనసాగుతోంది. ముసునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షకీనా ఇవాంజిలిన్ ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా జ్వరాల సర్వే, పరీక్షలు నిర్వహించారు. పారిశుద్ధ్య పనులు, దోమల నిర్మూలన కార్యక్రమాలు కొనసాగించారు. సాయంత్రం గ్రామంలో ఫాగింగ్ చేయించారు. సూపర్‌వైజర్ మురళీమోహన్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనాల్లో డీజేలకు అనుమతి లేదు

తిరువూరురూరల్: గణేష్ నిమజ్జన ఉత్సవాల్లో డీజేలకు అనుమతి లేదని తిరువూరు సెక్టార్–1 ఎస్‌ఐ సత్యనారాయణ నిర్వాహకులకు స్పష్టం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సవ నిర్వాహకులకు శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన ఎస్‌ఐ చింతలపాడు, వామకుంట్ల గ్రామాల్లో 9 మంది డీజే సౌండ్ సిస్టమ్ నిర్వాహకులను నవరాత్రి ఉత్సవాల్లో డీజే వినియోగించబోమని బాండ్ తీసుకుని తిరువూరు తహసీల్దారు ఉదయభాస్కర్ ఎదుట బైండోవర్ చేశారు.

జీఎస్టీ ఎగవేసిన దుకాణాలపై దాడులు

తిరువూరు: జీఎస్టీ ఎగవేసి వ్యాపారాలు నిర్వహిస్తున్న తిరువూరులోని పలు దుకాణాలపై అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఎలక్ట్రానిక్, మొబైల్స్ దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిగినట్లు గుర్తించిన అధికారులు ఆయా షాపుల్లోని రికార్డులను తనిఖీ చేశారు. తిరువూరు సినిమాహాల్స్ సెంటర్, రాజస్థాన్ సెంటర్లలోని దుకాణాల్లో 10 గంటల పాటు ఈ తనిఖీలు జరిగాయి. రూ.లక్షల్లో జీఎస్టీ చెల్లించకుండా ఎలక్ట్రానిక్ వస్తువులు, సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు కొనుగోలు చేసినట్లు తనిఖీల్లో గుర్తించినట్లు తెలుస్తోంది.

క్రమశిక్షణ, ఏకాగ్రతతో లక్ష్యాలు చేరుకోవాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఏకాగ్రత, పట్టుదల, క్రమశిక్షణతో విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సైకాలజిస్ట్, ఫ్యాకల్టీ మిరియాల సాంబశివరావు తెలిపారు. కొండపలి క్రాంతి హైస్కూల్‌లో 9, 10 తరగతుల విద్యార్థిని విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ వీఆర్కే నగర్ మహిళా ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు పదో తరగతి తర్వాత తమ లక్ష్యాన్ని ఏ విధంగా చేరుకోవాలనే అంశంపై విపులంగా వివరించారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ జిల్లా క్యాబినెట్ సెక్రటరీ పి.దివ్యవాణి, రీజనల్ చైర్ పర్సన్ గట్టి లక్ష్మి, క్లబ్ అధ్యక్షులు జయగుణ, క్యాబినెట్ మెంబర్ డాక్టర్ విజయవాణి, దేవినేని జోనీ కుమారి, అమ్మాజీ పాల్గొన్నారు.

వరద బీభత్సానికి ఏడాది

- మైలవరం నియోజకవర్గాన్ని అతలాకుతలం చేసిన బుడమేరు వరద
- తీవ్రంగా నష్టపోయిన ప్రజలు
- అరకొరగా పరిహారం అందించి చేతులు దులుపుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఏడాది గడిచినా వరద నివారణ చర్యలు శూన్యం



బుడమేరు వరద ముంపులో ఉన్న మైలవరం (ఫైల్)



సురక్షిత ప్రాంతాలకు వెళ్తున్న జి.కొండూరు బీసీ కాలనీ వాసులు (ఫైల్)



ఇంట్లోకి వచ్చిన వరద నీరు (ఫైల్)

జి.కొండూరు: బుడమేరు వరద బీభత్సానికి నేటితో ఏడాది పూర్తయ్యింది. నాటి చేదు జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకుంటూ భవిష్యత్తు వరద ప్రమాదాన్ని ఊహిస్తూ మైలవరం నియోజకవర్గ ప్రజలు ఏడాది కాలంగా తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. భరోసా ఇవ్వాల్సిన ప్రభుత్వం అరకొర సాయం అందించి చేతులు దులుపుకోవడంతో బాధితులు నరకయాతన పడ్డారు. వరద నివారణ చర్యలను చేపట్టడంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి స్థానికంగా రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం పడి ఆర్థిక కష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. బుడమేరు ప్రక్షాళన చేపట్టి వరద ముంపునకు పరిష్కార మార్గం చూపితే తప్ప నియోజకవర్గ ప్రజలకు ఇప్పట్లో ముంపు భయం వీడేలా లేదు.

అసలేం జరిగింది..

గతేడాది ఆగస్టు 30న శుక్రవారం మెల్లగా మొదలైన వర్షం ఆ రాత్రి భారీ వర్షంగా మారింది. దీంతో ఆగస్టు 31వ తేదీన ఉదయానికల్లా మైలవరం నియోజకవర్గంలోని కొండవాగు, కోతులవాగు, కళింగవాగు, కోవ వాగు, పులివాగు, వెంకటాపురం వాగు, దొర్లింతాల వాగు, కప్పలవాగు, తొమ్మండ్రం వాగులతో పాటు పలు వాగులు పొంగి పొర్లాయి. ఒక్కసారిగా ఊహించని వరద ఉప్పొంగడంతో నియోజకవర్గంలో 34 చెరువులకు గండ్లు పడ్డాయి. ఈ వరద ప్రవాహానికి మైలవరం, జి.కొండూరు, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం మండలాలు ముంపునకు గురయ్యాయి. అయితే అదే రోజు సాయంత్రానికి వెలగలేరు హెడ్‌రెగ్యులేటర్ వద్దకు 30వేల క్యూసెక్కులకుపైగా వరద నీరు చేరడంతో అధికారులు 11 గేట్లను ఎత్తడంతో తర్వాతి రోజు సెప్టెంబరు ఒకటో తేదీన ఉదయానికి విజయవాడ రూరల్‌లోని లోతట్టు ప్రాంతాలన్నీ ముంపునకు గురయ్యాయి. కృష్ణానదికి కూడా వరద ప్రవాహం పెరగడంతో ఇబ్రహీంపట్నం పూర్తిగా ముంపునకు గురైంది.

ముంపు బాధితులు ఇలా..

నియోజకవర్గంలో గతేడాది వచ్చిన భారీ వరద ప్రవాహానికి రెడ్డిగూడెం మండల పరిధిలో 350 మంది, మైలవరం మండల పరిధిలో 3,500 మంది, జి.కొండూరు మండల పరిధిలో 2,172 మంది, ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 11 వేల మందిని బాధితులుగా అధికారులు నష్ట గణన లిస్ట్‌లో చేర్చారు. వీరిలో కొందరు అసలు బాధితులే కాని వారిని చేర్చి అసలైన బాధితులను లిస్ట్‌లో చేర్చలేదని అప్పట్లో బాధితులు ఆందోళన చేశారు. భారీ వర్షాలతో వరద ప్రవాహానికి నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 8 మంది ప్రాణాలను కోల్పోయారు.

మూగ జీవాల మృత్యు ఘోష

నియోజకవర్గంలో గేదెలు, ఆవులు కలిపి 229 మృతి చెందగా, మేకలు, గొర్రెలు కలిపి 210, కోళ్లు 9,819 మృతి చెందినట్లు అధికారులు గుర్తించారు. రైతులు మూగజీవాలను కోల్పోయి రూ.2 కోట్ల వరకు నష్టపోయారు. మృతి చెందిన ఆవులు, గేదెలకు ఒక్కొక్క పశువుకు రూ.37,500, మేకలు, గొర్రెలకు రూ.4 వేలు, ఒక్కొక్క కోడికి రూ.100 చొప్పున పరిహారం ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంది.

నష్టపోయిన రైతాంగం

నియోజకవర్గంలో వరి 6,280 హెక్టార్లు, పత్తి 2,330 హెక్టార్లు, పెసర 216 హెక్టార్లు, మినుము 775 హెక్టార్లు, మొక్కజొన్న 34 హెక్టార్లు, వేరుశనగ 10 హెక్టార్లలో రైతులు నష్టపోయినట్లు అధికారులు అప్పట్లో ప్రాథమిక అంచనాలు వేశారు. ఈ విధంగా వరి పంటకు రూ.22.42 కోట్లు, పత్తి పంటకు రూ.13.15 కోట్లు, పెసర పంటకు రూ.54 లక్షలు, మినుము పంటకు రూ.1.93 కోట్లు, మొక్కజొన్నకు రూ.12 లక్షలు, వేరుశెనగకు రూ.5 లక్షల వరకు నష్టపోయారు. అదే విధంగా ఉద్యానవన పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రభుత్వం అందించిన పరిహారం రైతులకు ఏ మాత్రం ఊరటనివ్వలేదు.

గండ్లు ఇలా..

పలు వాగులు, బుడమేరు పొంగడంతో 34 చెరువులకు గండ్లు పడ్డాయి. ఏ.కొండూరు మండలంలో బుడమేరు పుట్టిన ప్రదేశం నుంచి వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వరకు 42 కిలోమీటర్ల పరిధిలో 80కి పైగా గండ్లు పడగా అధికారులు సర్వే చేసి ఈ గండ్లను 65 పనులుగా గుర్తించారు. ఈ గండ్లను పూడ్చేందుకు మొత్తంగా 126 పనులకు గానూ రూ.43.91కోట్లు ఖర్చు చేశారు. ఈ పనులు కూడా వర్క్ ఆర్డర్లు, ఎస్టిమేషన్‌లు లేకుండానే పనులు ప్రారంభించి నాసిరకం పనులు చేశారని ఆరోపణలు వచ్చాయి. రహదారి మరమ్మతులకు రూ.78.58కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనా వేశారు. కవులూరు గ్రామ శివారులో మూడు గండ్లు పడిన ప్రదేశంలో రిటైనింగ్ వాల్, వెలగలేరు హెడ్‌రెగ్యులేటర్ మరమ్మతు పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

వరదను తలుచుకుంటేనే భయమేస్తోంది



గతేడాది వచ్చిన భారీ వరద ప్రవాహానికి కట్టుబట్టలతో గ్రామం నుంచి బయటకు వచ్చాం. ఇల్లు, ఇంట్లో సామాన్లు, పంటలు నీటి ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయాం. రెండు ట్రాక్టర్లు నీళ్లలో మునిగిపోవడంతో తక్కువ ధరకు విక్రయించి నష్టపోయాం. వరదను తలుచుకుంటేనే భయమేస్తోంది.

– దాసరి అంబేద్కర్, కృష్ణానది ముంపు బాధితుడు, పెద్ద లంక, ఇబ్రహీంపట్నం

ఎస్సీ సెల్ కార్యవర్గం నియామకం



ఇబ్రహీంపట్నం: వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ ఆదేశాల మేరకు మైలవరం నియోజక వర్గంలోని వివిధ మండలాల ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులను నియమించినట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త జోగి రమేష్ తెలిపారు. ఈమేరకు ఇబ్రహీంపట్నంలో ఎస్సీ సెల్ కార్యవర్గ సభ్యులను శనివారం ప్రకటించారు. ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నల్లమోతు దుర్గారావు, జిల్లా కార్యదర్శి దొంతమాల కిరణ్, జిల్లా కార్యనిర్వాహక సభ్యులు ప్రత్తిపాటి వెంకటరమణ, తంగేళ్లమూడి రవిబాబు, కొండపల్లి మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా చందా చంటి, వివిధ మండలాల ఎస్సీ సెల్ అధ్యక్షులు దొంతమాల వెంకటస్వామి(ఇబ్రహీంపట్నం), సక్కుర్తి గంగులు(మైలవరం), మట్టకొయ్య రాము(రెడ్డిగూడెం), తగరం నాగరాజు(విజయవాడ రూరల్), పేయ్యల ప్రతాప్‌కుమార్ (జి.కొండూరు) నియమించినట్లు తెలిపారు. నూతన సభ్యులను అభినందించారు. నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు నల్లమోతు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగంలో పలువురికి చోటు



పి.సురేష్ (జోజి)



పల్నాటి రఘు



వేమూరి సురేష్

నూజివీడు/ముసునూరు: వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కమిటీలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నూజివీడు నియోజకవర్గానికి చెందిన పలువురిని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడిగా దేవరగుంటకు చెందిన పల్నాటి రఘు, కార్యదర్శిగా నూజివీడు పట్టణానికి చెందిన పత్తిపాటి సురేష్(జోజి), కార్యనిర్వాహక సభ్యులుగా గుళ్లపూడి శివారు గుడిపాడుకు చెందిన వేమూరి సురేష్, కూరాకుల రామకృష్ణలను నియమించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

నూజివీడు: కళాశాల విద్యార్థులు డ్రగ్స్‌కు, ఆకర్షణకు దూరంగా ఉండి చదువు పైనే దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ పేర్కొన్నారు. మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం మాదక ద్రవ్యాలు, ఆకర్షణ, శక్తి యాప్ అంశాలపై విద్యార్థులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ సీఐ సత్యశ్రీనివాస్, ప్రిన్సిపాల్ తేజేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు యూటీఎఫ్ జిల్లా సమావేశం

మైలవరం: యూటీఎఫ ఎన్టీఆర్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం మైలవరంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరుగుతుందని యూనియన్ కార్యదర్శి గంగరాజు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, బొడ్డు నాగేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోజ్‌కుమార్, జిల్లా నేతలు హాజరవుతారన్నారు. ప్రస్తుత విద్యారంగ పరిస్థితులపై చర్చిస్తామని చెప్పారు.

ఇష్టారాజ్యంగా నిధుల దుర్వినియోగం

కౌన్సిల్ సమావేశంలో వైఎస్సార్ సీపీ సభ్యుల ఆందోళన



తిరువూరు నగర చైర్‌పర్సన్ నిర్మలకు డీసెంట్ నోట్ అందజేస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు

తిరువూరు: ప్రజావసరాల కోసం కేటాయించిన జనరల్ ఫండ్‌ను అధికారపక్షం ఇష్టానుసారం ఖర్చు చేస్తోందని తిరువూరు నగర పంచాయతీ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ నిర్మల అధ్యక్షతన శనివారం జరిగింది. జనరల్ ఫండ్ నుంచి రూ.35 లక్షల నిధులను ఎటువంటి నిబంధనలు పాటించకుండా వివిధ పనులకు కేటాయించారని, ఒకే పనికి రెండు సార్లు నిధులు కేటాయించాలని ఎజెండాలో ప్రతిపాదించారని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు ఆరోపించారు. ట్రాక్టర్లు, ట్రక్కులు, పుష్‌కార్టుల మరమ్మతుకు వేర్వేరు పేర్లతో లక్షలాది రూపాయలు ఖర్చు చేయాలని చూడటం అధికార దుర్వినియోగమేనని వారు ఆక్షేపించారు. వాహనాల మరమ్మతు పనులకు ఒకేసారి బడ్జెట్ కేటాయించి టెండర్లు పిలిచి పనులు చేయించాల్సి ఉండగా, దొడ్డిదారిన నిధులు కేటాయించడంపై నిలదీశారు. గతంలోనూ కచ్చా డ్రెయిన్ల తవ్వకం, పూడిక తీత పనులకు రూ.20 లక్షలు కేటాయించగా, తాము అడ్డుకోవడంతోనే పాలకపక్షం వెనక్కు తగ్గిందని, ఇప్పుడు కూడా జనరల్ ఫండ్ నుంచి నిధులు దండుకోడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. డ్రెయిన్ల పూడిక తీతకు తాజాగా రూ.4 లక్షలకు పైగా ఖర్చు చేయడానికి కౌన్సిల్ సమావేశంలో ప్రతిపాదించడంపై చర్చించాలని డిమాండ్ చేశారు.

డీసెంట్ నోట్ అందజేత..

సమావేశపు ఎజెండాలోని ఆరు అంశాలను తీవ్రంగా వ్యతిరేకించిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఈ అంశాలను ఆమోదించవద్దని కోరుతూ చైర్‌పర్సన్‌కు డీసెంట్ నోట్ అందజేశారు. నగర పంచాయతీలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులకు రూ.3 వేల చొప్పున పెంపుదలకు సమావేశంలో ఆమోదం తెలిపారు. రూ.15.37 లక్షల గ్రంథాలయ పన్నును నగర పంచాయతీ నుంచి చెల్లింపునకు ఆమోదం తెలుపుతూ తీర్మానించారు. వైస్ చైర్‌పర్సన్ గుమ్మా వెంకటేశ్వరి, కౌన్సిలర్లు మోదుగు ప్రసాద్, ఇనపనూరి చిన్నారి, షేక్ నదియా, పాలం రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

గుంతలో పడిన లారీ.. ట్రాఫిక్‌కు అంతరాయం

మైలవరం: మైలవరం – నూజివీడు ఆర్‌అండ్‌బీ రహదారిలోని గుంతలో పడి లారీ నిలిచిపోవడంతో శనివారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మైలవరం నుంచి నూజివీడు వైపు సిమెంట్ రేకుల లోడ్‌తో వెళ్తున్న లారీ వెల్వడం గ్రామం భాస్కరరావు నగర్ కాలనీ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలో పడి టైర్ పగిలింది. దీనితో నడిరోడ్డుపై లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రహదారి పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. దీనిపై సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేయడంతో రోడ్డుకు మరమ్మతులు చేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారి హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి రోజులు గడుస్తున్నా స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు



చాట్రాయి: రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ లంకా నిర్మల అధికారులను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. వరి పంటకు సరిపడిన యూరియాను రైతులకు సక్రమంగా అందించాలన్నారు. సొసైటీల్లో యూరియా కొరతగా ఉందని మండల పరిషత్ ఉపాధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు సభ దృష్టికి తీసుకురావడంతో కొద్దిగా కొరత ఉందని, త్వరలోనే సరిపడినంత యూరియా సొసైటీలకు చేరుతుందని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ సమాధానం ఇచ్చారు. నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో భార్గవి ఏవోకి సూచించారు. చీపురుగూడెం శివారు మంగపేట ప్రభుత్వ పాఠశాల తరగతి గదిలో వాన కురుస్తుందని, విద్యార్థులకు సరిపడినంత బెంచీలు లేవని ఎంపీటీసీ మోరంపూడి స్వరూపరాణి సభకు వివరించారు. వేరే పాఠశాలల్లో మిగిలిపోయిన బెంచీలను తరలించి స్కూల్లో ఏర్పాటు చేయాలని ఎంపీడీవో ఎంఈఓ – 2 బ్రహ్మచారికి సూచించారు. 22 మంది అధికారులు సమావేశానికి రావాల్సి ఉండగా 12 మంది గైర్హాజరు కావడంతో కలెక్టర్‌కి నివేదిక ఇస్తామని ఎంపీడీవో తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ముగిసిన జనరేటివ్ ఏఐపై ఆన్‌లైన్ ఎఫ్‌డీపీ

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏఐ అండ్ ఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో జనరేటివ్ ఏఐ ఫౌండేషన్స్, మోడల్స్ అండ్ రియల్ వరల్డ్ అప్లికేషన్స్ ఇన్ విజన్ అండ్ లాంగ్వేజ్ అనే అంశంపై వారం పాటు నిర్వహించిన ఆన్‌లైన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ) శనివారం ముగిసింది. కార్యక్రమాన్ని చీఫ్ ప్యాట్రన్స్ ఎల్.జయప్రకాశ్‌రెడ్డి, ఎల్‌ఆర్‌ఎస్‌కే ప్రసాదరెడ్డి, ప్యాట్రన్స్ డాక్టర్ కె.అప్పారావు(ప్రిన్సిపాల్), వైస్ ప్రిన్సిపాల్ బి. రమేష్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎఫ్‌డీపీని డాక్టర్ ఎస్.జయప్రద, హెచ్‌ఓడీ, సీఎస్‌ఈ–ఏఐ అండ్ ఎంఎల్, కన్వీనర్‌గా, బి.శ్రీనివాసరావు కో కన్వీనర్‌గా వ్యవహరించారు. కార్యక్రమాన్ని డాక్టర్ ఎస్కే జమీర్, జాన్ వెస్లీ చప్పిడి, ఎస్‌కే సల్మా ఆసియా బేగం, ఎస్‌కే రజీనా బేగం, ఎల్.నరేంద్ర సమన్వయం చేశారు. ఐఐటీ రాయచూర్, ఎన్ఐటీ వరంగల్, మహీంద్రా యూనివర్సిటీ నుంచి నిపుణులు ప్రసంగించారు. దేశ వ్యాప్తంగా ఉన్న అధ్యాపకులు, పరిశోధకులు ఆన్‌లైన్‌లో పాల్గొని జనరేటివ్ ఏఐలో అభివృద్ధి చెందుతున్న మోడల్స్, పరిశోధన సవాళ్లు, వాస్తవ జీవిత అన్వయాలపై అవగాహన కల్పించారు.

ఎల్బీఆర్‌సీఈలో 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర'

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎన్‌సీసీ, ప్రకృతి క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల థీమ్ మాన్‌సూన్ హైజీన్ కార్యక్రమాన్ని శనివారం విద్యార్థులు నిర్వహించారు. మాన్‌సూన్ హైజీన్‌లో భాగంగా ఎంపీయూపీ స్కూల్‌లో విద్యార్థులకు పరిశుభ్రత, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎన్ఎస్ఎస్ వలంటీర్లు విద్యార్థులకు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలను నాటాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ బి.శివహరిప్రసాద్, ఉమామహేశ్వరరెడ్డి ఎన్‌సీసీ కోఆర్డినేటర్ ఆర్.పవిత్ర, ప్రకృతి క్లబ్ కోఆర్డినేటర్లు డాక్టర్ వహీదా నీలోఫర్, డాక్టర్ వి.భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కో ఆర్డినేషన్ సమావేశం

విస్సన్నపేట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీపథకం పనులకు సంబంధించి 18వ విడత సామాజిక తనిఖీ కో ఆర్డినేషన్ సమావేశం వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించినట్లు ఏపీఓ రామారావు తెలిపారు. గృహ నిర్మాణశాఖ ఏఈ, పీఆర్ అధికారులు, ఎస్ఆర్‌పీలు, డీఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోండి

ఆగిరిపల్లి: టీచర్లందరూ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు ఆనంద్ కుమార్, హేబెల్ సూచించారు. మండలంలో శనివారం ఆగిరిపల్లి, ఈదులగూడెం, ఈదర, అడవినెక్కలంలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ క్లస్టర్ సమావేశాలను ఎంఈఓలు పరిశీలించారు. హెచ్ఎంలు పులి పుష్పలత, సందీపాము శారద, తాడి ప్రసాద్, పీవీ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

నూజివీడు: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనిలో భాగంగా స్టాకు రిపోర్ట్ ప్రకారం ఎరువుల నిల్వలను పరిశీలించారు. అలాగే ఈపోస్ మిషన్ ద్వారా ఎరువుల విక్రయాలను నిర్వహిస్తున్నారా, లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియాతో పాటు ఎరువులను ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించడానికి ప్రయత్నిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, స్టాక్ రిపోర్ట్‌లు, బిల్ బుక్‌లను సరిగా నిర్వహించకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూజివీడు మండలంలో సొసైటీలు, ప్రైవేటు దుకాణాల వద్ద 21.50 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. అనంతరం మార్కెట్‌యార్డు ఆవరణలో ఉన్న భూసార పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. డీఏఓతో పాటు ఏడీఏ జీ విద్యాసాగర్, ఏఓ పలగాని చెన్నారావు పాల్గొన్నారు.

తిరువూరు: యూరియా, డీఏపీ ఎరువుల కొరత నేపథ్యంలో తిరువూరు పట్టణంలోని పలు డీలర్ల దుకాణాల్లో శనివారం అధికారులు తనిఖీ చేశారు. తహసీల్దారు ఉదయభాస్కర్, ఎస్ఐ సత్యనారాయణ, ఏడీఏ రంగారావు, ఏవో పద్మ సంయుక్తంగా ఆయా దుకాణాల్లో ఎరువుల స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు.

రేకుల షెడ్డు కూల్చేందుకు విశ్వ ప్రయత్నాలు

నూజివీడు: పట్టణంలోని పోతురెడ్డిపల్లి రోడ్డులో

సంక్షిప్త వార్తలు

నాచిన చెరువు ఎదురుగా ఉన్న స్థలంలో ఉన్న షెడ్డును కూల్చేందుకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడి మేరకు మున్సిపాలిటీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. మున్సిపాలిటీ స్థలం కానప్పటికీ రేకుల షెడ్డును కూల్చడానికి శనివారం టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పంపించడం గమనార్హం. అయితే ఈ స్థలం వ్యవహారం కోర్టులో ఉన్నందున కోర్టు నిర్ణయించే వరకు ఎవరూ జోక్యం చేసుకోవద్దని షెడ్ యజమాని తరుపు న్యాయవాది చెప్పడంతో వారు వెనుదిరిగి వెళ్లిపోయారు.

పోలీసుల అదుపులో పెట్రోల్ బంక్ కార్మికుడు

ఇబ్రహీంపట్నం: వీటీపీఎస్ కోఆపరేటివ్ సొసైటీ హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో నగదు గోల్‌మాల్ ఆరోపణలు ఎదుర్కొని పరారీలో ఉన్న కాంట్రాక్ట్ కార్మికుడు గోపాలకృష్ణ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. పెట్రోల్ బంక్‌లో విధులు నిర్వహించి ఈనెల ఒకటిన అదృశ్యమైనట్లు 8వ తేదీన అతని భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇంటికి వచ్చినట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఇతను కోట్లలో నగదు కుంభకోణంకు పాల్పడ్డాడనే ఆరోపణలు ఉన్నాయి. పాలకవర్గం మాత్రం కేవలం రూ.15లక్షలు గోల్‌మాల్ జరిగినట్లు చెబుతున్నారు. నగదు విషయంపై విచారణ చేపట్టినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. అయితే స్థానిక ద్వితీయశ్రేణి కూటమి నేతలు రంగప్రవేశం చేసి బయట ప్రైవేట్ పంచాయతీలో నగదు విషయం తేల్చేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

మైలవరం: యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి తెలిపారు. స్థానిక కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు రెండో రోజైన శనివారం కొనసాగాయి. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. క్రీడలతో విద్యార్థుల్లో శారీరక ధృఢత్వం, మానసిక ఉల్లాసం పెంచుకుని విద్యలో రాణించాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగారావు, ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి మాట్లాడుతూ క్రీడలను ప్రాథమిక విద్యలో భాగం చేయాలన్నారు. అనంతరం విజేతలకు బంగారు, కాంస్య పతకాలు ప్రదానం చేశారు.

పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే లక్ష్యం

ఆగిరిపల్లి: పీ 4 కార్యక్రమం ద్వారా పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ భార్గవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నూజివీడు సీడ్స్‌కు చెందిన మండవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బంగారు కుటుంబాలకు శనివారం చెక్కులను అందజేశారు. చావల మహాలక్ష్మికి రూ.20 వేలు, షేక్ జైనబికి రూ.45 వేలు, షేక్ రజియాబికి ట్రై సైకిల్, రూ.25 వేలు చెక్కులను మండవ ఫౌండేషన్ ప్రతినిధులు బి.సుబ్బారావు, ఎం.వెంకటేశ్వరరావు అందజేశారు. ఏఓ అబ్దుల్ సలాం పాల్గొన్నారు.